



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా, వీసీ సుదర్శనరావు



సగానికిపైగా కొండను తవ్వేసిన దృశ్యం



బ్లాస్టింగ్‌ను అడ్డుకుంటున్న గ్రామస్థులు (ఫైల్)

- అనుమతి తీసుకున్నది ఒకదానికి.. చేస్తున్నది మరొకటి..
- లక్షలు గడిస్తున్న కొందరు క్రషర్ యజమానులు
- బ్లాస్టింగ్‌ను మళ్లీ అడ్డుకున్న గ్రామస్థులు

కొండలు పిండి

చింతకుంట కొండ ప్రాంతంలో అక్రమంగా బ్లాస్టింగ్

పుట్లూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అది కొండ ప్రాంతం. చుట్టు పట్ల మూడు కిలోమీటర్ల వరకు గ్రామాలు లేవు. దీంతో అక్కడికి ఎవరు వస్తారులే కొందరు అక్రమార్కులు బరితెగించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు క్రషర్ యజమానులు, ఓ బడా కాంట్రాక్టర్ కొండలను పిండి చేస్తూ లక్షల రూపాయలతో జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని చింతకుంట గ్రామ సరిహద్దులో రెండు రోజుల కిందట కొండల్లో బ్లాస్టింగ్ చేసేందుకు యత్నించగా ఆ ఊరి ప్రజలు అడ్డుకున్నారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కొండ ప్రాంతంలో రాళ్లను క్రషింగ్ యూనిట్‌కు తరలించడానికి క్రషర్ యజమానులు, బడా కాంట్రాక్టర్ లీజు అనుమతులు ప్రభుత్వం నుంచి తీసుకున్నారు. అయితే వారు రాళ్లను మాత్రమే తరలించకుండా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు ఇచ్చిన తర్వాత కనీసం ఒక్కసారైనా అధికారులు వెళ్లి పరిశీలించి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని చింతకుంట గ్రామ సర్వేనంబరు 1లో వందల ఎకరాలకు పైగానే కొండ ప్రాంతం ఉంది. చింతకుంట, కందికాపుల, సూరేపల్లి, అరకటవేముల, ఏ. కొండాపురం, తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామాల నుంచి మేకలు, గొర్రెలు, పశువులను కాపర్లు ఈ కొండ ప్రాంతంలో మేపడానికి తీసుకువెళుతుంటారు. దీంతో అక్కడ బ్లాస్టింగ్ చేస్తున్న విషయం చూసిన కొందరు గొర్రెల కాపరులు గ్రామ సర్పంచు శివరామయ్యకు సమాచారం అందించారు. దీంతో ఆయన గ్రామస్థులతో కలిసి అక్కడకు చేరుకుని అనుమతులు లేకుండానే బ్లాస్టింగ్ ఎలా చేస్తారంటూ మండిపడ్డారు. వందల సంఖ్యలో పశువులు కాపరులు ఉంటారని ఏమైనా జరిగితే మీరు బాధ్యత వహిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి బ్లాస్టింగ్‌ను నిలిపివేయించారు.

అనుమతులు లేవు

పుట్లూరు మండలంలోని చింతకుంటలో బ్లాస్టింగ్‌కు సంబంధించి ఎవరు అనుమతులకు దరఖాస్తు చేసుకోలేదు. బ్లాస్టింగ్ అనుమతులు ఆర్డీఓ, డీఎస్పీ నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండా తవ్వకాలు, బ్లాస్టింగ్ చట్టరీత్యానేరం. ఆ కొండలో ముగ్గురు రాళ్ల తరలింపునకు అనుమతి తీసుకున్న మాట వాస్తవం.

ఓబులరెడ్డి, మైనింగ్ ఏడీ, తాడిపత్రి

ఇష్టానుసారంగా బ్లాస్టింగ్

కొండ ప్రాంతంలో ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ చేసి రాళ్లను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల మేరకు హెక్టార్ ప్రాంతాన్ని లీజుకు తీసుకొని అక్కడ దొరికే రాళ్లను మాత్రమే తరలించాల్సి ఉంది. కానీ ఈ కొండలో బ్లాస్టింగ్ చేసి మరీ రాళ్లను క్రషర్‌లకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం గ్రామస్థులే ఏకమై అక్రమరవాణాను అడ్డుకొనేందుకు వెళ్లగా రాత్రికి రాత్రే భారీ యంత్రాలను పక్కకు మార్చేసినట్లు సమాచారం. వ్యవసాయ పొలాలకు మట్టిని రవాణా చేసుకోవాలంటేనే కచ్చితంగా మైనింగ్ అనుమతి ఉండాలని రైతులను బెదిరిస్తున్న అధికారులు ఈ అక్రమ రవాణాపై చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అధికారులకు తెలిసే జరుగుతోందా..?

మండలంలోని కొండప్రాంతంలో బ్లాస్టింగ్‌కు కొందరు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బ్లాస్టింగ్ చేయాలంటే రెవెన్యూ, మైనింగ్ తదితరశాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అలాగే బ్లాస్టింగ్ జరిగే ప్రాంతంలో నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటించాలి. కానీ చింతకుంటలో మాత్రం నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. గుట్టుచప్పుడు కాకుండా ఎవరికి తెలియకుండా బ్లాస్టింగ్‌కు ప్రయత్నాలు చేశారు. నెలరోజులక్రితం అక్కడక్కడ చిన్నపాటి బ్లాస్టింగ్ చేశారు. అప్పుడు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఇక తమను ఎవరూ పట్టించుకోరనే ధైర్యంతో పెద్ద పెద్ద బ్లాస్టింగ్‌లు చేయడానికి సిద్ధపడ్డారు. ఇదంతా అధికారులకు తెలిసే జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఏ అధికారికి ఫిర్యాదు చేసినా తమకు తెలియదంటూ పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహిస్తున్నారు. బ్లాస్టింగ్ జరిగిన సమయంలో పెద్దఎత్తున కొండప్రాంతంలోని రాళ్లు గాలిలో ఎగిరి చాలా దూరంగా పడే అవకాశాలు ఉన్నాయి. ఆ సమయంలో కాపరులు గానీ, గొర్రెలు గానీ, పరిసర ప్రాంతాల రైతులు గానీ ఉంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ గ్రామస్థులు మండిపడుతున్నారు.



క్రషింగ్‌కు తరలించేందుకు కుప్పగా పోసిన రాళ్లు



ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత?

పంచాయతీలో ఎలాంటి అక్రమ తవ్వకాలు నిర్వహించినా అడ్డుకుంటాం. మాకు తెలియకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారు. గ్రామస్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. మా పంచాయతీలో ఎక్కువ కొండప్రాంతం ఉండటంతో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. ఎక్కువమంది పశుసంపదను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. కొండ ప్రాంతంలో గడ్డి ఎక్కువగా ఉండటంతో అక్కడికి వెళ్లి పశువులను మేపుకుంటున్నారు.

- శివరామయ్య, సర్పంచు

బ్లాస్టింగ్ విషయం నాకు తెలియదు

చింతకుంట కొండలో బ్లాస్టింగ్ విషయం నాకు తెలియదు. నిజంగా అక్కడ అనుమతులు లేకుండా తవ్వకాలు, బ్లాస్టింగ్ వంటివి చేస్తుంటే మాత్రం ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకుంటాం. రెండురోజుల కిందట ఆ పంచాయతీ సర్పంచు ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే సిబ్బందిని పంపించి నిలిపివేయించాం.

- శేషారెడ్డి, తహసీల్దార్



ఆరోగ్యకర సమాజం కోసం కృషి

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజ స్థాపన కోసం ప్రతి పౌరుడు కృషి చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక జేఎన్‌టీయూ మైదానంలో ఆదివారం ఆయన క్రీడాజ్యోతిని వెలిగించి ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారు అథ్లెటిక్ పోటీలకు హాజరుకావడం శుభపరిణామమన్నారు. అనంతరం పరుగు, స్పీడ్ వాక్ పోటీలు ఆసక్తిగా సాగాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు, ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్ బాబు, సికందర్, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, డాక్టర్ కొండయ్య, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అర్బన్‌బ్యాంకు మాజీ సీనియర్ మేనేజర్ వీజీ లోకనాథ్, మాస్టర్స్ అథ్లెటిక్స్ తదితరులు పాల్గొన్నారు.

కర్షకులు, కార్మికులకు అండ ఎర్రజెండా

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కళ్యాణదుర్గం రూరల్/కుందుర్పి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కర్షకులు, కార్మికులకు అండ ఎర్రజెండా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. కుందుర్పి మండలంలోని బెస్తరపల్లిలో ఆదివారం సీపీఐ శతవార్షికోత్సవాల్లో భాగంగా అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల శిలాఫలకం, సీపీఐ కార్యాల యం, గ్రంథాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు తప్పెట్లు, ఉరుములు, చెక్కభజనలతో సీపీఐ నాయకులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో పోరాడిన గ్రామాల్లో బెస్తరపల్లి ఒకటని కొనియాడారు. ఇలాంటి పోరాటాల ఫలితంగా నియోజకవర్గంలోని దాదాపు 50 వేల ఎకరాలకు పైగా పేద ప్రజలకు పంచామన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం పనిచేయని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం సమాజ శ్రేయస్సు కోసం పనిచేయకుండా సినీ నిర్మాతలు, బడా హీరోల కోసమే పనిచేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. పక్కా రాష్ట్రం తెలంగాణలో బెనిఫిట్ షోలకు టికెట్ల ధరలను పెంచబోమని చెబితే, ఇక్కడ ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాత్రం పెంచుతామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం కాని, వారి సంక్షేమం గురించి గాని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ సంజీవప్ప, నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఓంకార్ యాదవ్, సీపీఐ నాయకులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న రామకృష్ణ, జగదీష్ తదితరులు

మధ్యాహ్న భోజనంలో మార్పులు

పరిగణనలోకి ఎస్ఎంసీ సూచనలు

ఏజెన్సీలకు బకాయిలు చెల్లించేలా ఏర్పాట్లు

7లో

విస్తరిస్తున్న మట్కా

తాడిపత్రి ప్రాంతంలో పెరుగుతున్న మహమ్మారి

సాంకేతికత సాయంతో జోరుగా సాగుతున్న వైనం

- 6లో...

కళ్యాణం... కమనీయం



వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం

ఆత్మకూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పుష్య మాస షష్ఠి సందర్భంగా కల్యాణోత్సవం, ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీనివాస ప్రసాద్, అసిస్టెంట్ స్థపతి సుబ్రహ్మణ్యం, ఇంజనీర్ హరిత, కార్యనిర్వహణ అధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి, తదితరుల పాల్గొన్నారు.

గుంటికింద సుబ్బరాయుడికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక సమీపంలో వెలసిన గుంటికింద సుబ్బరాయుడికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ పూలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.



ప్రత్యేక అలంకరణలో కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఇక మొదలు..!

నేటి నుంచి బోగస్ పింఛన్ల ఏరివేత

ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించనున్న వైద్యులు

కర్నూలు జిల్లా నుంచి వచ్చిన వైద్య బృందాలు

అనర్హుల్లో ఆందోళన రేపుతున్న వెరిఫికేషన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బోగస్ పింఛన్ల ఏరివేతపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. తప్పుడు సదరం సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్న వారిపై ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఫిర్యాదులు అందాయి. దీంతో హెల్త్, దివ్యాంగుల విభాగాల్లోని పింఛన్లను క్షేత్రస్థాయిలో అధికారుల బృందం పరిశీలించనుంది. తొలి విడతగా జిల్లాలో 2,499మంది పింఛన్‌దారులను పరిశీలించనున్నారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 35వేలకు పైగా అనర్హులు పింఛన్ పొందుతున్నట్లు సమాచారం. అక్రమ పింఛన్‌దారులకు అడ్డుకట్ట వేస్తే ప్రభుత్వానికి నెలకు సుమారు రూ.20కోట్ల వరకు ఆదా అవుతుందని అంచనా. ప్రస్తుతం మంచానికే పరిమితమైన పింఛన్‌దారుల కేటగిరీలో సోమవారం నుంచి వెరిఫికేషన్ చేయనున్నారు. దీంతో అక్రమ మార్గాల్లో పింఛన్ తీసుకుంటున్న వారిలో గుబులు రేగుతోంది.

అనర్హులు.. కొన్ని ఉదాహరణలు

మంచానికే పరిమితమైన కేటగిరీలో ఉన్న పింఛన్‌దారులను పరిశీలిస్తున్న ప్రభుత్వం నకిలీలు, అనర్హులను కూడా పరిశీలించాలనే డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో సుమారు 2వేలకు పైగా అనర్హులను పింఛన్ జాబితా నుంచి తొలగించాలని ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం నుంచి పారితోషికం తీసుకునే వారు పింఛన్లకు అనర్హులు. అయితే రాప్తాడులో గ్రామ వలంటీరు, ఆమె భర్త పింఛన్ పొందుతుండటం గమనార్హం. వలంటీరు సుగాలి లక్ష్మీదేవి, ఆమె భర్త దాసరి శబరికి వైకల్యం లేదు. అయినా గత వైసీపీ ప్రభుత్వం అండతో సదరం సర్టిఫికెట్ తెచ్చుకున్నారు. ఐడీ నంబరు 11200155753, ద్వారా పింఛన్ పొందుతున్నారు. అదే రాప్తాడులో వలంటీరు మారుతమ్మ భర్త శివకు వైకల్యం లేకపోయిన సదరం సర్టిఫికెట్‌తో ఐడీ నంబరు 1200099942 ద్వారా పింఛన్ తీసుకుంటున్నారు. అదే రాప్తాడులో వలంటీర్ గణేష్ తల్లి ఆదినారాయణమ్మ కూడా ఐడీ నంబరు 1121128048 ద్వారా పింఛన్ పొందుతున్నారు. అదే ప్రాంతంలో వలంటీరు చాకలి లక్ష్మీదేవి తల్లి నాగలక్ష్మి పేరుతో అక్రమంగా పింఛన్ పొందుతున్నారు. కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన బండి సరస్వతి వలంటీరుగా పనిచేస్తూనే పింఛన్ తీసుకుంది. ఐడీ నంబరు 12500031123 కింద పింఛన్ తీసుకుంటోంది. తన భర్త బండి రవి పేరిటి కూడా సదరం సర్టిఫికెట్ తెప్పించి పింఛన్‌కు దరఖాస్తు చేసుకుంది. ఆయన పింఛన్ ఐడి నంబరు 12500015878. ఇవి మచ్చుకు మాత్రమే. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం పరిశీలించి విచారణ జరిపితే వేలల్లోనే బయటపడటం ఖాయమని చెబుతున్నారు.

మంచానికే పరిమితమైన పింఛన్‌దారులు 2,499 మంది

జిల్లాలో 2,499మంది మంచానికే పరిమితమైన పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి నెలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15వేలు చొప్పున పింఛన్ చెల్లిస్తోంది. జనవరి నెలకు సంబంధించి జిల్లాలో 2,84,085మంది పింఛన్‌దారులకు రూ.124.86కోట్లు నిధులు చెల్లించారు. ఆయా కేటగిరీల్లో పరిశీలిస్తే వృద్ధులు 1,39,472మంది, వితంతువులు 66,354మంది, చేనేతలు 6,588 మంది, కల్లుగీత కార్మికులు 351మంది, మత్స్యకారులు 876మంది, ఒంటరి మహిళలు 6,687మంది, సఫాయి కర్మాచారులు 3,464మంది, హిజ్రాలు 205మంది, హెచ్‌ఐవి బాధితులు 2,432మంది, డప్పు కళాకారులు 3,089మంది, కళాకారులు 178మంది, దివ్యాంగులు 45,820మంది, కుష్టు వ్యాధి బాధితులు 381మంది, ప్రమాద బాధితులు 1074మంది, అభయహస్తం 4,186మంది ఉన్నారు.

జిల్లాకు ఆరు బృందాలు..రోజుకు 30 పరిశీలన

బోగస్ పింఛన్ల క్షేత్రస్థాయిలో పరిశీలనకు కర్నూలు జిల్లా నుంచి ఆరు డాక్టర్ల బృందాలు జిల్లాకు చేరాయి. ప్రతి బృందంలో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. రోజుకు 30మందిని చొప్పున క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. సోమవారం నుంచి 10వతేదీ వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయనున్నారు. డాక్టర్ల బృందాలు మంచానికే పరిమితమైన వారి ఇళ్లవద్దకే వెళ్లి పరీక్షలు చేస్తారు. దివ్యాంగుల కేటగిరీలో ఉన్న వారిని దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షించనున్నారు. వైద్య బృందాలు ఇళ్ల వద్దకు వెళ్లిన సమయంలో పింఛన్‌దారులు అందుబాటులో లేకపోయినా, సూచించిన తేదీన హాజరుకాకపోయినా వారి పింఛన్లను హోల్డ్‌లో పెడతారు. తనిఖీలు పూర్తయిన తర్వాత వాటిలో మళ్లీ 5శాతం లబ్ధిదారుల వివరాలను ర్యాండమ్‌గా పరిశీలిస్తారు. ఇప్పటికే ఆయా జాబితాలను కలెక్టర్, డీఆర్‌డీఏ-వెలుగు పీడీలకు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ర్యాండమ్‌గా చేసే తనిఖీల్లో అనర్హులకు ఇంకా పింఛన్లు ఇస్తున్నట్లు తేలితే అందుకు బాధ్యులైన డాక్టర్ల బృందాలపై చర్యలు తీసుకోనున్నారు.

విడతల వారిగా వెరిఫికేషన్

అనర్హుల పింఛన్ల పరిశీలన విడతల వారిగా చేపట్టనున్నారు. మొదటి విడతలో మంచానికే పరిమితమైన పింఛన్‌దారులను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇప్పటికే కర్నూలు జిల్లా నుంచి కేటాయించిన ఆరు వైద్యబృందాలు జిల్లాకు చేరాయి. ఒక్కో బృందంలో ఇద్దరు డాక్టర్ల చొప్పున ఉంటారు. రోజుకు 30మంది పింఛన్‌దారులను ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలిస్తారు. రెండో విడతలో దివ్యాంగుల కేటగిరీకి సంబంధించిన పింఛన్‌దారులను పరిశీలిస్తారు. అనర్హులను జాబితానుంచి తొలగిస్తారు. అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఈశ్వరయ్య, పీడీ, డీఆర్‌డీఏ-వెలుగు





డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయం

బజ్జీ అంటే బుజ్జీదే..!

వెరైటీ బజ్జీలతో ఆకట్టుకుంటున్న అవినాశ్.. సాయంత్రమైతే క్యూకడుతున్న కస్టమర్లు

కష్టపడే గుణానికి సృజనాత్మకతను జోడిస్తే ఎలా విజయం సాధించవచ్చో నిరూపిస్తున్నాడు గుంతకల్లుకు చెందిన ఓ యువకుడు. తన నిక్ నేంతో హోటల్‌ను ప్రారంభించిన ఈ యువకుడు అద్భుతమైన రుచితో వివిధ వెరైటీల్లో బజ్జీలను తయారు చేసి, కష్టమర్ల చేత లొట్టలు వేయిస్తున్నాడు. పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద నివసిస్తున్న అవినాశ్ నిక్‌నేం బుజ్జి. ఆ నిక్ నేంతోనే స్థానికులందరికీ పరిచయం. దీంతో ఉపాధి కోసం తన నిక్‌నేమ్‌తోనే బజ్జీల దుకాణాన్ని ప్రారంభించాడు. పార్సిల్ మాత్రమే కాకుండా అక్కడే కూర్చొని తినడానికి హోటల్ మాదిరిగా టేబుళ్లు కూడా ఏర్పాటు చేశాడు. దీంతో సాయంత్రం అయ్యిందంటే చాలు బజ్జీల షాపు కిటకిటలాడుతూ కనిపిస్తుంది. కాస్త చలి వాతావరణం ఉంటే మరీను. ఎనిమిది మంది కుటుంబ సభ్యులకు పాటు మరో ఇద్దరికి పని కల్పించి, తాను కూడా ఉపాధి పొందుతున్నాడు.

-ఆంధ్రజ్యోతి, గుంతకల్లు



రకరకాల బజ్జీలను తయారుచేసి అమ్ముతున్న అవినాశ్, కుటుంబ సభ్యులు



బుజ్జీ బజ్జీల షాపు

14 రకాల వెరైటీలు



తన దుకాణంలో 14 రకాల బజ్జీలు తయారు చేస్తున్నట్లు అవినాశ్ పేర్కొన్నాడు. సాధారణంగా బజ్జీల షాపుల్లో కనిపించే మిర్చి బజ్జీ, కట్ మిర్చి, ఆలు బోండా, అలసంద వడ, వంకాయ బోండా, మైసూరు బోండా, మసాలా వడతోపాటు బ్రెడ్ బజ్జీ, ఆపరేషన్ బజ్జీ, కట్లెట్ (వెజ్), స్వీట్ కార్న్ కట్‌లెట్, పాలక్ చాట్, ఆలు ట్విస్టర్, టమోటా బజ్జీ, స్ప్రింగ్ ఆనియన్ బజ్జీలను తయారు చేస్తాడు. రుచి చాలా బాగా ఉండటంతో బజ్జీల కోసం కష్టమర్లు ఎగబడుతుంటారు. అయితే బ్రెడ్ ముక్కలతో తయారుచేసే బజ్జీలు మాత్రం అత్యంత ప్రజాదరణ పొందాయి. ప్రతి రోజూ కనీసం 10 రకాల వెరైటీలు ఇక్కడ తయారు చేస్తారు. మిగతా నాలుగింటిలో రోజూ ఏదో ఒక రకం బజ్జీని వీక్ స్పెషల్‌గా తయారుచేస్తూ ఆహారప్రియుల మనసు చూరగొంటున్నారు. కొత్తరకం బజ్జీలను తయారు చేసినప్పుడల్లా తన ఇన్‌స్టాగ్రాం చానల్ ద్వారా ప్రచారం చేస్తూ స్థానికులను ఆకట్టుకుని, రప్పిస్తున్నాడు.

స్ఫూర్తిగా నిలుస్తున్న గుంతకల్లు యువకుడు

బిజీ హోటళ్లను చూసి స్ఫూర్తి పొందా

హైదరాబాదులోనూ, యూట్యూబ్‌లోనూ రద్దీగా ఉన్న బజ్జీల షాపులను చూసి స్ఫూర్తి పొందా. బళ్లారిలో ఉన్న మా మామ (భార్య తండ్రి) వంట మాస్టారు. ఆయన వద్దకు వెళ్లి వెరైటీ బజ్జీలను తయారు చేయడం నేర్చుకున్నా. 8 ఏళ్ల టిఫిన్ సెంటర్ నిర్వహించా. నాలుగేళ్ల కిందట 14 రకాల బజ్జీలను తయారుచేసి సాయంత్రం నుంచి అమ్మడం మొదలు పెట్టా. నేను వేస్తున్న బజ్జీలు జనానికి ఎంతో నచ్చాయి. రోజుకు బజ్జీల ద్వారానే దాదాపు రూ. 7 వేలదాకా వ్యాపారం అవుతోంది. కస్టమర్ల నమ్మకాన్ని నిలుపుకోవడానికి ఎక్కడ కొత్తరకం బజ్జీలను చూసినా, వెంటనే వాటిని నేర్చుకుని తయారు చేస్తున్నా.

- అవినాశ్, బజ్జీ సెంటర్ నిర్వాహకుడు, గుంతకల్లు



మధ్యాహ్న భోజనంలో మార్పులు

పరిగణనలోకి ఎస్ఎంసీ సూచనలు

ఏజెన్సీలకు బకాయిలు చెల్లించేలా ఏర్పాట్లు

ధర్మవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం మెనూలో మార్పులు తీసుకురానున్నట్లు సమాచారం. ఇవి సంక్రాంతి తరువాత అమలుల్లోకి రానున్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులు చేయబోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పథకాన్ని అస్తవ్యస్తంగా కొనసాగించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల సూచనలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకుని మెనూలో మార్పులకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు 2097 ఉండగా.. ఇందులో 1వతరగతి నుంచి 10వతరగతి వరకు చదివే విద్యార్థులు 2లక్షల 47వేల మంది ఉన్నారు. ఇందులో 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడంలేదని తెలుస్తోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. అనేక సార్లు గత ప్రభుత్వం దృష్టికి విద్యాశాఖ నివేదికల రూపంలో అందించినా ఫలితం లేకుండాపోయింది.

మెనూలో మార్పులు ఇలా..

- ప్రభుత్వ జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే బడ్జెట్ ముందుగా పెంచాలి. భోజనం కోసం ఫోర్టిఫైడ్ అంటూ లావుగా ఉన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. వాటి స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలన్న పాఠశాలల విజ్ఞప్తులను పరిశీలిస్తున్నారు.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ అడుగుతున్నారు. ఉదయం ఇచ్చే రాగిజావాలో నాణ్యత ఉండటంలేదు, దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు ఇవ్వాలని లేదా పాలు ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది.
- విద్యార్థుల రోజువారీ మెనూలో ఒక రోజు ఇచ్చే పొంగలిని సరిగా తినడంలేదు. దీనిలో కూడా మార్పులు చేయాలి.
- అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వడంలేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కోడిగుడ్లు కూడా సరఫరా చేయాలని భావిస్తున్నారు.
- ప్రతి శనివారం అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మధ్యాహ్న భోజన పథకంలో స్వీట్‌ను పిల్లలు సరిగా తినటంలేదు. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆలోచిస్తున్నారు.
- వంట ఏజెన్సీలకు బకాయిలు సకాలంలో చెల్లించడంలేదు. అప్పులు చేయాల్సి వస్తోందని, ఏ నెలకు ఆ నెల సకాలంలో బిల్లులు ఇస్తే అప్పులు బాధ తప్పుతుందని విజ్ఞప్తులు ఉన్నాయి. వంటచేసే ఏజెన్సీలకు చెల్లించే చార్జీలు పెంచేలా ప్రభుత్వానికి నివేదించాలని పాఠశాలలు చేసిన విజ్ఞప్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. ఆయా మార్పులతో సంక్రాంతి తరువాత నూతన మెనూ అమలు చేస్తారని తెలుస్తోంది.



మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



ఎంపీఈఓల నూతన కార్యవర్గ సభ్యులు

ఎంపీఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రెడ్డిప్రసాద్

అనంతపురం అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎంపీఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రెడ్డిప్రసాద్ ఎంపికయ్యారు. నగర శివారులోని పీవీకేకే కళాశాలలో ఆదివారం ఆ సంఘం జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీఈఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సంఘం తరఫున సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునేలా తీర్మానం చేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎంపీఈఓల సంఘం గౌరవ అధ్యక్షుడిగా నాగరాజు, సలహాదారుడిగా భాస్కర్ నాయక్‌ను ఎంపిక చేశారు. అలాగే సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా భాగ్య లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌నాయక్, అదనపు ప్రధాన కార్యదర్శిగా రాజ్యలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా శివకుమార్, లక్ష్మీనారాయణ, ముత్యాలు, కోశాధికారిగా తిరుపతి, అదనపు కోశాధికారిగా నాగరాజు, ఈసీ మెంబర్లుగా పలువురిని ఎంపిక చేశారు. నూతన కార్యవర్గానికి పలువురు ఎంపీఈఓలు శుభాకాంక్షలు తెలిపారు.

బాలవికాస్ విద్యతో బంగారు భవిష్యత్తు

పుట్టపర్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ విద్యతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు. బాలవికాస్ పూర్వ విద్యార్థుల సదస్సు రెండోరోజు ఆదివారం కూడా కొనసాగింది. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో కార్యక్రమం నిర్వహించారు. మొదట విద్యార్థులు ర్యాలీగా సాయికుల్వంత్ సభామండపానికి చేరుకున్నారు. వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి బాబా ప్రవేశపెట్టిన బాలవికాస్ విద్యతో లక్షలమంది విద్యార్థులు బాల్యంలోనే ఆధ్యాత్మికత, విలువలు, భారతీయ సంస్కృతి అలవడుతాయన్నారు. అనంతరం బాలవికాస్ గురువులను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, గ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి సత్కరించారు. అనంతరం బాలవికాస్ విద్యార్థులు నృత్యాన్ని ప్రదర్శించారు. సదస్సులో దాదాపు 2500 మంది పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న విద్యార్థులు

మోగిన శంఖం




కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు





సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద



హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

అనంతపురంరూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలపై ఈనెల 7 నుంచి ఏపీఎస్పీడీసీఎల్ హైబ్రిడ్ పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్ఈ సంపత్‌కుమార్ తెలిపారు. ఆమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్తు పంపిణీ సంస్థల్లో 2025-26ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక అవశ్యకత, ధరలు, వీలింగ్ ధరలు, విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తామన్నారు. ఈనెల 7, 8 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విజయవాడలో వ్యక్తిగత హాజరు, రెండు గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనవచ్చునన్నారు. అదేవిధంగా 10న కర్నూలులో వ్యక్తిగత హాజరు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ అభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. అనంతపురం సర్కిల్ ఆఫీస్‌లో అనంతపురం టౌన్ డివిజన్, కళ్యాణదుర్గం డివిజన్ ఆఫీసు కళ్యాణదుర్గం ఆపరేషన్ పరిధిలోని వినియోగదారులకు, గుత్తి డివిజన్ ఆఫీసులో గుత్తి ఆపరేషన్ పరిధిలోని వినియోగదారులు పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే వారు ముందుగా పేర్లు నమోదు చేసుకుని అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలపాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం వెబ్‌లింగ్ ద్వారా ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించవచ్చన్నారు. ఏఈఈ ఆఫీసులు, డీఈఈ, ఈఈ, సర్కిల్ ఆఫీసులో పేర్ల రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

తెగుళ్ల ఉధృతి

శెట్టూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పంటలకు సోకుతున్న తెగుళ్లు అన్నదాతకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో వందల ఎకరాల్లో రైతులు వేరుశనగ, మొక్కజొన్న, టమోటా తదితర పంటలు సాగు చేశారు. అయితే ఈ ఏడాది భారీగా పొగమంచు ఉండటంతో పంటలకు చీడపీడల ఉధృతి బాగా పెరిగింది. తెగుళ్ల నివారణకు పదేపదే ఎన్ని పురుగు మందులు పిచికారీ చేసినా ఉపయోగం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలతో సతమతమవు తున్న అన్నదాతకు సలహాలు ఇచ్చే వ్యవసాయాధికారులు కరువయ్యారు. దీంతో ఎరువుల దుకాణాల వద్దకు వెళ్లి వారికి తెగులు సోకిన పంటను చూపించి, ఇచ్చిన మందులు తెచ్చుకుని పిచికారీ చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించి సకాలంలో అన్నదాతలకు సలహాలు, సూచనలు ఇచ్చేలా వ్యవసాయ సిబ్బందిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.




మచ్చ తెగులు సోకిన వేరుశనగ మొక్కలు

8న జిల్లాలో కరువు బృందం పర్యటన



అనంతపురం అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంటనష్టంపై అధ్యయం కోసం కేంద్ర కరువు బృందం ఈనెల 8న జిల్లాలో పర్యటించనుంది. ఈ మేరకు జిల్లాలో పర్యటన షెడ్యూల్‌ను ఆదివారం ఖరారు చేశారు. ఈనెల 8న మధ్యాహ్నం 2 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు అనంతపురం రూరల్ మండలం మన్నీలకు కరువు బృందం సభ్యులు చేరుకుంటారు. ఆ గ్రామంలో గతేడాది ఖరీఫ్‌లో సాగు చేసిన ఆముదం పంటను పరిశీలించి, స్థానిక రైతులతో మాట్లాడతారు. అక్కడి నుంచి రాప్తాడు మండలానికి చేరుకొని, ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించి, స్థానిక రైతులతో మాట్లాడతారు. అక్కడి నుంచి బెంగళూరుకు రోడ్డు మార్గాన బయల్దేరి వెళ్తారు.

టమోటా కిలో రూ.10



అనంతపురం రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 8, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

చిరుత దాడిలో రెండు ఆవుదూడల మృతి

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్నేపల్లి రోడ్డు సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ తోటలో శనివారం అర్ధరాత్రి ఆవుదూడలపై ఓ చిరుత దాడి చేసినట్లు రైతు రాజన్న తెలిపారు. దీంతో రెండు దూడలు మృతి చెందాయన్నారు. తరచుగా పంట పొలాల్లో చిరుతలు సంచరిస్తూ దూడలు, మేకలపై దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖాధికారులు స్పందించి చిరుతలను బంధించాలని కోరారు. సంఘటనా స్థలాన్ని అటవీశాఖాధికారులు పరిశీలించారు. రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఆవుదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

న్యూస్ బాక్స్

నేడు ప్రజాఫిర్యాదుల వేదిక

● కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో భాగంగా సోమవారం నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పేర్కొన్నారు. శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. తనతో పాటు జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ, ఇతర జిల్లా ఉన్నతాధి కారులంతా ఈ గ్రీవెన్స్‌కు హాజరవుతారని తెలిపారు. శింగనమల నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

సద్వినియోగం చేసుకోండి

శింగనమల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తునట్లు తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య తెలిపారు. ప్రజలు, రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి, ఆ వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. అలాగే శింగనమల నియోజకవర్గం స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలు, రైతులు, టీడీపీ శ్రేణులు సద్వి నియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ ఆదివారం ప్రకటనలో కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

గార్లదిన్నె, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా హెచ్చరించారు. ఆయన ఆదివారం కల్లూరు, గార్లదిన్నె గ్రామాల్లో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన రికార్డులు, అధిక లోడును పరిశీలించారు. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పరిమితికి మించి ఆటోలలో అధిక మంది ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచిందచారు. అధికమందితో ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దవడుగూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తిఅనంతపురం ప్రధాన రహదారిలో నిలిపి ఉంచిన కారు నుంచి దిగుతున్న వ్యక్తిని ఐషర్ వాహనం ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తెలంగాణ రాష్ట్రం షామీర్‌పేట మండలం లాల్‌గుడి మలక్‌పేట్ గ్రామానికి చెందిన సయ్యద్ సిద్దుముల్లా(40) అనే వ్యక్తి ప్రమాదంలో మృతి చెందాడు. సిద్దుముల్లా కుటుంబ సభ్యులతో ఆదివారం స్వగ్రామం నుంచి బెంగళూరుకు వెళుతుండగా కారు ముందు టైరు పంక్చర యింది. డ్రైవర్ టైరు మారుస్తుండగా సిద్దుముల్లా మధ్య సీటు నుంచి డోరు తీసి కిందకు దిగడంతో వెనుక నుంచి వచ్చిన ఐషర్ వాహనం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు ఆశిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కనగానపల్లిలో షార్ట్ సర్క్యూట్

● కాలిపోయిన విద్యుత్ పరికరాలు




ఓ ఇంట్లో కాలిపోయిన ఫ్రిడ్జ్, స్విచ్ బోర్డు

కనగానపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కనగానపల్లిలో ఆదివారం నాలుగురోడ్ల కూడలి పరిధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయని స్థానికులు తెలిపారు. ఉదయం 11గంటల సమయంలో ఇలా జరిగిందని ప్రజలు తెలిపారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో కంప్యూటర్ పరికరాలు కాలిపోయాయని సిబ్బంది తెలిపారు. కేజీబీవీలోని తరగది గదుల్లో లైట్లు, ఫ్యాన్లు కాలిపోయాయని ఆ పాఠశాల ఎస్ఓ నరసమ్మ తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తాత్కాలిక చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల రూ. లక్షల్లో నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల లక్షల్లో నష్ట వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. 11కేవీ వైరు తెగిపోయి ఎల్‌టీ లైన్‌ను తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి వీధి దీపాలతో పాటు ఇళ్లు, కార్యాలయాల్లోని విద్యుత్ పరికాలు కాలిపోయాయి. సమాచారం అందిన వెంటనే విద్యుత్ లైన్ల మరమ్మతులు చేశామని లైన్‌మ్యాన్ గౌస్ తెలిపారు.

తోపుదుర్తి చందుపై చర్యలు తీసుకోవాలి

● ఎస్ఐకి టీడీపీ నాయకుల ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ స్థానిక నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి ఆలియాస్ చందుపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు ఆదివారం రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన గతంలో రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్, వారి కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన రీతిలో మాట్లాడారని, వాటిపై ఫిర్యాదు చేస్తున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఆ రోజు అసభ్యకరంగా మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో ఇప్పటికీ సర్క్యులేట్ అవుతున్నాయన్నారు. అతడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతిప్రసాద్, తెలుగుయువత శ్రీధర్‌నాయుడు, పరంధామయాదవ్, జయచంద్రనాయుడు ఉన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

● అవస్థలు పడుతున్న ప్రజలు, రైతులు
● శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో దుస్థితి



శింగనమల తహసీల్దార్ కార్యాలయం

శింగనమల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రమైన శింగనమలలో తహసీ ల్దార్ కార్యాలయాన్ని సిబ్బంది కొరత పీడిస్తోంది. దీంతో ప్రజ సమస్యల పరిష్కారం జఠిలంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో కీలకమైన ఆర్ఐ లేక పోవడంతో సర్టిఫికెట్ల జారీలో అలస్యం అవుతున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వినిసిస్తున్నాయి. మండలానికి గతంలో రెగ్యులర్ ఆర్ఐగా నవీన్‌ను నియమించినా ఆయన కలెక్టర్ కార్యాలయానికి డిప్యుటైషన్‌పై వెళ్లిపోయారు. దీంతో హెచ్‌ఎల్‌సీ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి హనుమాన్ ప్రసాద్‌ను స్థానిక ఆర్ఐగా డిప్యుటేషన్‌పై నియమించారు. ఆయన నాలుగు సంవత్సరాలు ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహించారు. ఆయన కూడా గత నెల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి రాలేదు. ఆయనను తిరిగి హెచ్‌ఎల్‌సీ కార్యాలయానికే పంపారు. దాదాపుగా నెల రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో పలు ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ఆర్ఐ రిపోర్టు పొందేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కార్యాలయానికి సరిగా రావడంలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అంతేగాకుండా మండలపరిధిలోని నాలుగు రెవెన్యూ గ్రామాలైన చక్రాయపేట, లోలూరు, ఆకులేడు, జూలా కాల్వకు రెగ్యులర్ వీఆర్‌ఓలు లేరు. దీంతో ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగిస్తున్నారు. ఇలా తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండడం వలన వివిధ పనులపై కార్యాలయానికి వస్తే తీవ్ర జాప్యం జరుగుతోందని ప్రజలు, రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

మండలంలోని నాలుగు రెవెన్యూ గ్రామాలకు రెగ్యులర్ వీఆర్‌ఓలు లేరు. అక్కడ ఇన్‌చార్జ్‌లను నియమించి ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాల విషయంలోనూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. - సాకే బ్రహ్మయ్య, తహసీల్దార్, శింగనమల

దోబీ ఘాట్‌ల పునరుద్ధరణకు చర్యలు

● రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరమేశ్వరన్



శిథిలావస్థకు చేరిన దోబీ ఘాట్‌ను పరిశీలిస్తున్న పరమేశ్వరన్

అనంతపురం అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో నగరపరిధిలోని దోబీఘాట్‌లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరమేశ్వరన్ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక అరుణోదయ కాలనీ, స్టాలిన్ నగర్‌లోని దోబీఘాట్‌లను పరిశీలించారు. నిర్వహణ లోపంతో అరుణోదయ కాలనీలో ఎనిమిది ఎకరాల్లో ఉన్న అతి పెద్ద దోబీఘాట్ అస్తవ్యస్తంగా తయారైందని రజకులు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కనీస సౌ కర్యాలు కల్పించాలని కోరారు. అలాగే స్టాలిన్ నగర్‌లోని దోబీ ఘాట్‌లో ఉన్న తొట్టెలు శిథిలావస్థకు చేరాయని, బాగు చేయా లని కోరారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

సమస్యలపై ఉద్యమ కార్యాచరణ: ఎస్టీయూ



మాట్లాడుతున్న రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు

అనంతపురం విద్య, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు పేర్కొన్నారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన ఆ సంఘం 78వ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, జిల్లా పరిశీలకులు గోకారి హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లుదాటినా రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పెండింగ్ సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి రామాం జినేయులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షు డు హరిప్రసాద్ రెడ్డి, నాయకులు శ్రీరాములు, జ్యోతి, సూర్యుడు, చంద్రశేఖర్, శివయ్య ఆచారి, ఫణిభూషణ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈడిగలు రాజకీయ శక్తిగా ఎదగాలి: శివసాయిబాబా



సంఘీభావం తెలుపుతున్న ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఈడిగలు రాజకీయ శక్తిగా ఎదగాలని, అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని శివసాయిబాబా స్వామీజీ పేర్కొన్నారు. ఈడిగ సంక్షేమ సంఘం, రేణుకా యల్లమ్మ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం స్థానిక రేణుకా యల్లమ్మ ఆలయ కల్యాణమండపంలో నిర్వహించారు. శివసాయిబాబా, బీసీ కులసంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివసాయిబాబా స్వామీజీ మాట్లాడారు. అనంతరం రే ణుకా యల్లమ్మ సొసైటీ నూతన అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులతో... ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టిపల్లి సురేంద్రకుమార్ గౌడ్‌తోపాటు కార్యవర్గ సభ్యులతో స్వామీజీ ప్రమాణ స్వీకారం చేయించారు. తదనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఈడిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు నాయనపల్లి రాజు, నాగేంద్రప్రసాద్, కుళ్లాయిస్వామి, నాగేంద్రప్రసాద్, చంద్రగౌడ్, రఘురామయ్య, నారాయణస్వామి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పడమటిగాలి కవితా సంపుటి ఆవిష్కరణ



పడమటిగాలి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

అనంతపురం కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సాహితీవేత్త శంకరనారాయణ రచించిన పడమటిగాలి కవితా సంపుటిని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన ఆకాశవాణి వ్యాఖ్యాత డాక్టర్ జాగర్లపూడి శ్యామసుందరశాస్త్రి మాట్లాడుతూ.... ఆంగ్లసాహిత్యంలోని కవిత్వాన్ని తెలుగు భాషలోకి అనుసృజన చేయాలని అన్నారు. తద్వారా ప్రాచ్య, పాశ్చాత్య కవితా సంస్కృతుల సమ్మేళనం జరిగి విశ్వభావనలు స మాజంలో వ్యాప్తి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆంగ్ల సాహిత్యంలో ప్రముఖులైన కవుల కవిత్వానికి తెలుగు సేతగా సాహితీవేత్త శంకరనారాయణ రచించిన పడమటిగాలి కవితా సంపుటిని ఆదివారం సాయంత్రం తపోవనంలోని వేదగాయత్రి ఆలయంలో ఆవిష్కరించారు. జనప్రియ కవి ఏలూరు యంగన్న, శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు లతాశ్యాం, రొద్దం అనంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు రఘురాంరెడ్డి

అనంతపురం విద్య, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంక టేష్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావే శానికి రాష్ట్ర పూర్వపు అధ్యక్షుడు రఘురాంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి నరసింహులు హాజరై మాట్లాడారు. టీడీపీ ఎన్నికల ముందు ఉద్యోగులకు అనేక ఆర్థిక, ఆర్థికేతర హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లు దాటినా అమలు చేయ లేదన్నారు. సంక్రాంతికైనా కనీసం పీఆర్సీ కమిషన్‌ను నియమించి, 30 శాతం తగ్గకుండా ఐఆర్ ప్రకటించాలని కోరారు. లేకుం టే దశల వారీగా ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, పూర్వపు అధ్యక్షుడు వెంకటేశులు, ఉపాధ్య క్షులు నాగరాజు, మోహన్‌రెడ్డి, సతీష్‌కుమార్, బొమ్మయ్య, కార్యదర్శి చెన్నకేశవులు, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్‌వలి, రమణ, కృష్ణ, ఇతర నేతలు వన్నప్ప, గురురాజు, శ్రీనివాసులు, రామకృష్ణ, రవి, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నాపై అసత్య ఆరోపణలు: బండి పరశురామ్

ఆత్మకూరు జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలు ఓడించినా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి బుద్ధి రాలేదని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్ మండి పడ్డారు. ఎలాంటి సంబధంలేని విషయంలో తనపై ఆయన అనుచరులతో తప్పుడు ప్రచారం చేయిస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆయన ఆదివారం టీడీపీ స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అనుచరులు జగన్ సొంత పత్రికలో తనపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. తాను తప్పు చేశానని నిరూపిస్తే గొంతు కోసుకుంటానన్నారు. ఎవరి చరిత్ర ఏమిటో ప్రజలందరికీ తెలుసన్నారు. ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

ఆత్మకూరు జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పలువురు రైతులకు ఆదివారం మండలంలోని వడ్డుపల్లి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. వాటిని ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు చేతులుమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని రైతులు విన్నవించడంతో ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవ తీసుకుని, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు నాగేంద్ర, లక్ష్మీనారాయణ, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సిరివరం

● అన్ని రంగాల్లోనూ ఎస్ఎస్‌బీఎన్ మార్క్
● సమ్మేళనంతో తరలివచ్చిన విద్యార్థిలోకం
● మధురస్మృతులను పంచుకుని ఆనందించిన పూర్వ విద్యార్థులు



కళాశాల వ్యవస్థాపకులు సిరివరం ఆదినారాయణరావు

అనంతపురం సెంట్రల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యయా అమృత మశ్నుతే అంటూ ఎనిమిది దశాబ్దాల క్రితం సిరివరం ఆదినారాయణ రావు ఏర్పాటుచేసిన ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థులకు వరంగా మారింది. 1944లో ఓ గుడిసెలో పాఠాల బోధనతో ప్రారంభమైన కళాశాల నేడు మర్రిమానులా విస్తరించింది. ఈ ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కాలంలో వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దింది. సమాజంలోని అన్నిరంగాల్లో తన విద్యార్థులను భాగస్వాములను చేసి కొత్త మార్క్‌ను సాధించింది. మొత్తం ప్రపంచవ్యాప్తంగా, దశదిశలా ఎస్ఎస్‌బీఎన్ విద్యార్థులు స్థిరపడ్డారు. వారందరిని ఒక చోటకు చేర్చేలా శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు ఏర్పాటుచేసిన సమ్మేళనానికి కళాశాల పూర్వ విద్యార్థిలోకం వందలాదిగా తరలివచ్చింది. మొదటి రోజు జాతీయోన్నత పాఠశాల, రెండో రోజు జూనియర్ కళాశాల, మూడోరోజు డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థు ల సమ్మేళనం నిర్వహించారు. వారు పాఠశాల, కళాశాలలో చదువుకున్న రోజుల్లోని మధురస్మృతులను ఒకరినొకరు పంచుకుని సంబరపడ్డారు. తరలివచ్చిన విద్యార్థులు వారి మధుర స్మృతులు సెల్‌ఫోన్లలో బంధించి వారి స్నేహితులతో పంచుకున్నారు. నగరం చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచే అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమాచారం లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి రాలేకపోయారని ఒకింత బాధను వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.... వ్యవస్థాపకులు సిరివరం ఆదినారాయణ రావు దూరపు చూపుతో ఏర్పాటుచేసి వేలాదిమంది విద్యార్థులకు భవిష్యత్తును అందించారని హర్షాన్ని వ్యక్తంచేశారు. పిల్లా పాపలు, స్నేహితులతో వచ్చి నాటి విద్యార్థి జీవితాన్ని గుర్తు చేసుకోవడం మధుర ఘట్టంగా నిలిపోతుందని సంతోషం వ్యక్తం చేశారు.



కలిసి భోజనం చేస్తూ స్మృతులను పంచుకుంటున్న పూర్వ విద్యార్థులు

ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

● ప్రభుత్వ విప్ కాలవకు ఉద్యోగుల వినతి



ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థుల సౌకర్యార్థం డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటుచేయాలని ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులును కలిసిన ఉద్యోగులు రామానాయుడు, సుధాకర్, ప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణ తమ సమస్యలను వివరించారు. పార్ట్‌టైం ఉద్యోగులుగా తమకు నెలలుగా వేతనాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఓపెన్ యూనివర్సిటీపై దృష్టి పెట్టకపోవడంతో ప్రవేశాలు తగ్గిపోయి ఆర్థికంగా నష్టవాటిల్లిందన్నారు. జిల్లాలో వర్సిటీని ఏర్పాటుచేస్తే విద్యార్థులతో పాటు ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేదుకు కృషిచేస్తానని విప్ శ్రీనివాసులు వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను సన్మానించారు.

బైక్ అదుపు తప్పి విద్యార్థి మృతి



కిరణ్‌కుమార్

అనంతపురం క్రైం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలిటెక్నిక్ విద్యార్థి మృతి చెందాడు. శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్(19) జేఎన్‌టీయూ సమీపంలోని కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. సమీపంలోని భైరవ్‌నగర్‌లో స్నేహితులతో కలిసి అద్దెగదిలో ఉండేవాడు. ఆదివారం బైక్‌పై కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల రోడ్డులో వెళ్తుండగా.. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్దకు రాగానే ఆసుపత్రిలో నుంచి బయటకు వస్తున్న ఆటో ఢీ కొంది. దీంతో డివైడర్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్లిన కొంత సేపటికే మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీ అనంత వెంకటరెడ్డికి నివాళి

అనంతపురం క్రైం / న్యూ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ అనంతవెంకటరెడ్డికి వైసీపీ నేతలు నివాళులర్పించారు. అనంత వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన కుమారుడు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట అనంతవెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం సమీపంలోని ఘాట్‌కు వెళ్లి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీలు రంగయ్య, మాధవ్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనంత వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆ పార్టీ మైనార్టీ విభాగం రాష్ర అధ్యక్షుడు దాదాగాంధీ, నాయకులు శర్మాస్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సుంకర రమేష్‌కు పతకం



సుంకర రమేష్‌ను అభినందిస్తున్న జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్‌కు పతకాలు దక్కాయి. జేఎన్‌టీయూ మైదానంలో ఆదివారం నిర్వహిం చిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు కిలోమీటర్ల వాక్‌రన్‌లో సుంకర రమేష్ కాంస్యపతకం సాధించారు. విజేతను అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సీతంఆ విజయభాస్కర్, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి వీజీ లోకనాథ్‌తోపాటు బ్యాంకు పాలకవర్గసభ్యులు, అధికారులు అభినందించారు.

ఎట్టకేలకు జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రికెట్ అండర్-12 బాలుర జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వివాదాలు, ఆరోపణల నడుమ ఎట్టకేలకు జిల్లా అండర్-12 బాలుర జట్టును ఎంపిక చేశారు. ఎంపిక చేసిన తుది జట్టు వివరాలను జిల్లా క్రికెట్ సంఘం ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ప్రకటించింది. ఎంపికైన అండర్-12 బాలుర క్రికెట్ జట్టులో హఫీజ్‌రెడ్డి, హేమచంద్రనాయక్, ధనుష్, జైవీర్ రెడ్డి, తమోజ్ఞ, లలిత్ కిషోర్, రోహితేశ్వర్ రాజు, చరణ్‌తేజ్, రామ్‌చరణ్, ఉత్తేజ్‌యాదవ్, ఇస్మాయిల్, మోక్షన్‌తేజ, గణేష్, బురాద్దీన్, వెంకటలిఖిత్ రెడ్డి ఉన్నారు. స్టాండ్‌బైలుగా కుషాల్ రాయల్, కమ్రాన్‌ఫహాద్, మన్నన్, లలిత్‌సాయి, రాజా, ప్రజ్వల్ ఎంపికయ్యారు. ఎంపికైన జట్టు కడపలో ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జ్ సెక్రటరీ భీమలింగారెడ్డి, సెలెక్షన్ కమిటీ చైర్మన్ కమలాకర్ నాయుడు, సభ్యులు ఎస్ఎల్ఎన్ ప్రసాద్, భార్గవ్, మధు ఆచారి, యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు సావిత్రమ్మ, రామాంజనేయులురెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారి జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు పంచుకున్నారు. విద్యార్థిని, విద్యార్థులు వారు చదువుకున్న రోజుల్లో కొన్ని సంఘటనలను గుర్తు చేసుకొని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆరు ఇళ్లలో చోరీ

తాడిపత్రి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుంకులమ్మపాలెంలో శనివారం రాత్రి ఆరుఇళ్లల్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సుంకులమ్మపాలెంలో నివాసం ఉంటున్న రంగారెడ్డి, పెద్దిరెడ్డి, కృష్ణకు చెందిన ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో దొంగలు బీగాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నించారు. రంగారెడ్డి ఇంట్లో మాత్రం కొంత డబ్బు చోరీ అయినట్లు గుర్తించారు. కొంత దూరంలో ఉన్న వెంకటరాముడు, వెంకటేష్, గోవిందు ఇళ్లల్లో కూడా దొంగలు చోరీకి ప్రయత్నించారు. గోవిందు ఇంటిలో కూడా కొంత మొత్తం చోరీకి గురైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనాలకు సంబంధించి ఎవరు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దవడుగూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తిఅనంతపురం ప్రధాన రహదారిలో నిలిపి ఉంచిన కారు నుంచి దిగుతున్న వ్యక్తిని ఐషర్ వాహనం ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం షామీర్‌పేట మండలం లాల్‌గుడి మలక్‌పేట్ గ్రామానికి చెందిన సయ్యద్ సిద్దుముల్లా (40) అనే వ్యక్తి ప్రమాదంలో మృతి చెందాడు. సిద్దుముల్లా కుటుంబ సభ్యులతో ఆదివారం స్వగ్రామం నుంచి బెంగళూరుకు వెళుతుండగా కారు ముందు టైరు పంక్చరయింది. డ్రైవర్ టైరు మారుస్తుండగా సిద్దుముల్లా మధ్య సీటు నుంచి డోరు తీసి కిందకు దిగడంతో వెనుక నుంచి వచ్చిన ఐషర్ వాహనం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు ఆశిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వ్యక్తిపై దాడి.. నగదు అపహరణ



గాయపడిన మల్లయ్యస్వామి

బొమ్మనహాళ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో గల కురువళ్లి రాహదారిలో ఓవ్యక్తిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి నగదును అపహరించుకెళ్లారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని సిద్దరాంపురం గ్రామానికి చెందిన మల్లయ్యస్వామి బళ్లారి నుంచి బైక్‌లో స్వగ్రామానికి వస్తుండగా.. ఫ్యాక్టరీ సమీపంలో నలుగురు గుర్తు తెలియని దుండగులు రెండు బైక్‌లను రోడ్డుకు అడ్డంగా పెట్టి అతడిని ఆపారు. అనంతరం వారందరూ చితకబాది అతడి వద్ద ఉన్న రూ. 10500 నగదను లాక్కొని పరారయ్యారు. కొద్దిసేపటికి అదే దారిలో తెలిసిన వ్యక్తి రావడంతో ఆయన వెంట మల్లయ్యస్వామి ఇంటికి వెళ్లాడు. బాగా దెబ్బలు తగలడంతో ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స పొందాడు. సోమవారం పోలీసుల దృష్టికి తీసుకెళ్తామని బంధువులు తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

బెళుగుప్ప, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామని, అందులో ఓ వ్యక్తి ఇంటో సోదాలు చేయగా 70 టెట్రా ప్యాకెట్లు లభ్యమయ్యాయని తెలిపారు. అతడిని వెంటనే అరెస్టు చేసి, ఆ మద్యంను స్వాధీనం చేసుకున్నామని, అతడిపై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు..

యల్లనూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం సమీపంలో ఆదివారం పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.5500 నగదు స్వాధీనం చేసుకున్నామని ఏఎస్ఐ సంపత్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేశామన్నారు. అందులో పేకాటాడుతున్న వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పందుల అపహరణపై ఫిర్యాదు

బెళుగుప్ప, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పందులను అపహరించినట్లు వాటి పెంపకందారుడు రాజు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని ఓ గడ్డివాము వద్ద ఉన్న 10 పందులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గతంలో కూడా వాహనంతో వచ్చి తీసుకెళ్లారని తెలిపారు. విచారించి న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

గుత్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం రోడ్డు దాటుతున్న నాగమ్మ అనే వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దవడూగురు మండలం గుత్తిఅనంతపురానికి చెందిన నాగమ్మ పని నిమిత్తం గుత్తి పట్టణానికి వచ్చింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

740 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 740 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే అవుట్ ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 446 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

శెట్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ రవిబాబు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ రాంభూపాల్ యాదవ్‌కు సూచించారు. ఎవరైనా ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

తక్కళ్లపల్లిలో వ్యక్తిపై దాడి

పుట్లూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తక్కళ్లపల్లిలో ఓ వ్యక్తి వ్యక్తిపై దాడి జరిగినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. తక్కళ్లపల్లికి చెందిన సుధాకర్ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తోటలో పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తుండగా.. కొందరు పాతకక్షలు మనసులో పెట్టుకుని వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో సుధాకర్‌పై పైప్‌తో దాడిచేశారు. తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంతా మీకేనా.. మాకేమీ లేదా?

- గోకులం షెడ్ల బిల్లుల మంజూరుకు వసూళ్లు
- ఉపాధి సిబ్బంది, అధికారుల మధ్య విభేదాలతో బట్టబయలు
- ఒక్కొక్కరి నుంచి రూ.5వేల నుంచి రూ. 8వేల వరకు వసూలు



ఓ గ్రామంలో గ్రౌండింగ్ వర్క్‌లోనే ఆగిన గోకులం షెడ్డు నిర్మాణం

యాడికి, జనవరి5(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పనిచేసేది మేము, అక్రమ వసూళ్లు చేసుకుని ఆరగించేది మీరు... ఇక మాకు ఏమి ఉంటుంది అంటూ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది అధికారులతో వాదనలకు దిగినట్లు మండలవ్యాప్తంగా చర్చలు కొనసాగుతున్నాయి. అధికారులు, సిబ్బంది మధ్య విబేధాలతో గోకులంషెడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం ఎంతో సమున్నత లక్ష్యంతో పాడిరైతుల కోసం గోకులం షెడ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. కాగా ఆ పనులను పర్యవేక్షించాల్సిన ఉపాధిహామీ అధికారుల అక్రమ వసూళ్ల వ్యవహారంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. మండలంలో గోకులం షెడ్ల నిర్మాణంలో బిల్లుల మంజూరుకు ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఇద్దరు అధికారులు కలిసి ఒక్కొక్క లబ్ధిదారుడి నుంచి రూ.5వేల నుంచి 8వేల వరకు వసూలు చేస్తున్నారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. మండలవ్యాప్తంగా మొదటివిడతలో 38గోకులం షెడ్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటివరకు 15పూర్తయ్యాయి. 23షెడ్ల నిర్మాణంలో ఉన్నాయి. కాగా ఉపాధి పథకంలోని ఇద్దరు కీలక అధికారులు లబ్ధిదారుల నుంచి అక్రమ వసూళ్లకు తెరలేపినట్లు సమాచారం. అక్రమ వసూళ్ల సొమ్మును వారిద్దరే వాటాలుగా పంచుకుంటున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ల వాదనగా వినిపిస్తోంది. క్షేత్రస్థాయిలో తిరిగేది, లబ్ధిదారులకు అవసరమైన పనిచేసేది మేమైతే, బిల్లుల కోసం వచ్చిన లబ్ధిదారులతో మీరెలా అక్రమ వసూళ్లు చేస్తారని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ ఇద్దరు అధికారులతో వాదనకు దిగినట్లు సమాచారం. పంపకాల్లో తేడాతో అధికారులు, సిబ్బంది మధ్య విబేధాలు తలెత్తి గోకులం షెడ్ల నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తున్నట్లు సమాచారం. అధికారులు, సిబ్బంది కొట్లాడుతూ మమ్మల్ని ఇబ్బందులకు గురిచేయడం తగదని గోకులం షెడ్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని గోకులం షెడ్ల నిర్మాణంలో అక్రమ వసూళ్లను అరికట్టాలని, షెడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా అయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

వసూళ్లపై విచారిస్తాం..

గోకులం షెడ్లబిల్లుల మంజూరులో అక్రమ వసూళ్ల విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారిస్తాం. ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడి ఉంటే చర్యలు తీసుకుంటాం. బిల్లుల మంజూరు కోసం అధికారులకు ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.

-వీరరాజు, ఎంపీడీఓ, యాడికి

బాబోయ్.. కుక్కలు..

- రోడ్లలో గుంపులుగా వీధికుక్కల సంచారం
- వచ్చి వెళ్లే వారిని కరుస్తున్న శునకాలు
- ఒంటరిగా వెళ్లాలంటే భయాందోళన చెందుతున్న ప్రజలు



టీబీ రోడ్డులో గుంపులుగా వీధికుక్కలు

గుంతకల్లుటౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కలబెడద అధికమైంది. అవి రోడ్లపై గుంపులుగా చేరి వచ్చిపోయే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. దీంతో రోడ్లపై ఒంటరిగా వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వాసుపత్రికి ప్రతి రోజూ పదుల సంఖ్యలో కుక్క కాటు బాధితులు వస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ఈ బాధితులు అధికంగానే కనిపిస్తున్నారు.

గతంలో మున్సిపాలిటీల్లో వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టేవారు. వాటి సంఖ్య పెరగకుండా ఆపరేషన్లు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ఏటేటా కుక్కల సంఖ్య భారీగా పెరుగుతోంది. అవి గుంపులుగా రోడ్లపై చేరి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఏదైనా సంఘటన జరినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తున్నారని, లేకపోతే పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ధర్మవరం గేట్ వద్ద, టీబీ రోడ్డు, కసాపురం రోడ్డు, భాగ్యనగర్, పాతబస్టాండ్‌తోపాటు పలు కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. అధికంగా స్కూళ్లకు వెళ్లే పిల్లలు కుక్కకాటుకు గురవుతున్నారు. కుక్కల సమూహం పిల్లలను, ఒంటరిగా వెళ్లే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి వేళలో అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే ద్విచక్రవాహనదారుల వెంట పడుతున్నాయి. వాటిని తప్పించుకునే క్రమంలో వారు రోడ్డు ప్రమాదానికి గురై గాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ నయామ్ అహ్మద్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బలహీనంగా ఎస్ఎస్ ట్యాంకుల గట్లు



మొదటి ట్యాంకు గట్టుపై నెర్రెలు



సిమెంట్ లైనింగ్ వద్ద ఏర్పడిన రంధ్రం



రెండో ట్యాంకు గట్టుపై పెరిగిన కంప చెట్లు

- కుంగుతున్న నింబగల్లు సమీపంలోని ట్యాంకుల గట్లు
- మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు

ఉరవకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు సమీపంలో గల మొదటి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు గట్టు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అక్కడ సీపీడబ్ల్యూఎస్ స్కీం కింద మూడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నిర్మించారు. అయితే మొదటి ట్యాంకు గట్టు బలహీన పడ్డాయి. ఇది ఉరవకొండతో పాటు ఏడు గ్రామాలకు ప్రధాన తాగునీటి వనరుగా ఉంది. అయితే పైభాగంలో మట్టి గట్టు మొత్తం నెర్రెలు చీలి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ట్యాంకుల భద్రతపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే గట్టు కుంగిపోయింది. నాలుగేళ్ల కిందట గట్టు కుంగిపోయిన ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ట్యాంకు నీటి నిల్వ సామర్థ్యం 6 మీటర్లు కాగా గట్టు బలహీనంగా ఉండడంతో ప్రస్తుతం 5 మీటర్లు నీటిని మాత్రమే నిల్వ ఉంచారు. గతంలో రెండో ట్యాంకు గట్టుకు ఉన్న బండలు కుంగి పోయి ప్రమాదకర పరిస్థితులు తలెత్తిన సందర్భాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గతంలో వైసీపీ హయాంలో ఎస్ఈ కుంగి పోయిన గట్టును పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని సూచించినా అప్పట్లో కార్యరూపం దాల్చలేదు. దీంతో ఆ ట్యాంకు గట్టు ఎప్పుడు తెగిపోతుందో అన్న భయాందోళనలు ప్రజల్లో ఉన్నాయి. గత ఐదేళ్లలో ట్యాంకులకు మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. అలాగే ట్యాంకుల గట్లపై విపరీతంగా కంప చెట్లు పెరిగాయి. ట్యాంకుల్లో నీటి మట్టాన్ని పరిశీలించడానికి కూడా వీలు లేకుండా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకుల గట్ల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై డీఈ సఫ్రీన్‌ని వివరణ కోరగా నెర్రెలు అధికం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మరమ్మతులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్ బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



సర్టిఫికెట్లను చూపుతున్న కరాటే విద్యార్థులు

తాడిపత్రి, జనవరి5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌతమ్ మోడ్రన్ పాఠశాలలో 28మంది విద్యార్థులకు ఆదివారం మార్షల్ ఆర్ట్స్ బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మరోవైపు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం రావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం టెస్ట్‌లో ప్రతిభచూపిన పవన్‌కుమార్, మనోజ్, ప్రణీత్‌కుమార్, గౌతమ్‌రాజ్‌లకు బ్లాక్‌బెల్ట్‌లు అందించారు. మిగిలిన విద్యార్థులకు బెల్ట్‌లతోపాటు సర్టిఫికెట్‌లను అందించారు. మాస్టర్ ప్రభాకర్, కోచ్ శ్రీనివాసరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఉరవకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చునని యూటీఎఫ్ జిల్లా ఆడిటింగ్ సభ్యుడు రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞావికాసం అనే పరీక్షను నిర్వహించారు. పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు రాయబోయే పబ్లిక్ పరీక్షలకు ఈ పరీక్షలు దోహ దపడతాయన్నారు. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చునన్నారు. యూటీఎఫ్ నాయకులు ఉమాపతి, ఇస్లాంబాషా, వేణు, ఎస్ఎఫ్ఐ నాయకుడు సిద్ధూ పాల్గొన్నారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

'జేసీ ఫ్యామిలీని అపార్థం చేసుకోకండి'

గుంతకల్లుటౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తాడిపత్రికి చెందిన జేసీ ఫ్యామిలీ గురించి బీజేపీ నాయకులు తప్పుగా అర్థం చేసుకోవద్దని నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ గురించి ఆవేశంలో మాట్లాడానని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒప్పుకుని క్షమాపణలు కూడా కోరారన్నారు. ఇంతటితో ఈ వియాన్ని వదిలేయాలన్నారు. 40 ఏళ్ల నుంచి జేసీ ఫ్యామిలీ తాడిపత్రిని అభివృద్ధి చేశారని, వైసీపీ హయాంలో రాష్ట్రంలోనే తాడిపత్రి మున్సిపాలిటీని జేసీ ప్రభాకర్ రెడ్డి గెలిపించారని గుర్తుచేశారు. బీజేపీ నేతలు మాధవీలత, యామిని శర్మ అపార్థం చేసుకోవద్దని కోరారు. కూటమి ప్రభుత్వంలో మనమందరం కలిసి మెలిసి ఉందామని పేర్కొన్నారు. సమావేశంలో నారాలోకేష్ అభిమాన సంఘం జాతీయ కార్యదర్శి దబ్బర నారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..

శెట్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం నుంచి తిప్పనపల్లి వెళ్లే ప్రధాన రహదారిని అయ్యగార్లపల్లి వద్ద మరమ్మతుల పేరిట రోడ్డు కొద్దిమేర తవ్వారు. ఆ తర్వాత మరమ్మతులు చేయడం మరిచారు. దీంతో ఆ ప్రాంతంలోకి రాగానే వాహనచోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు నెలరోజుల క్రితం రోడ్డును మరమ్మతుల పేరిట జేసీబీతో కొద్దిమేర తవ్వారు. ఆ తర్వాత మరమ్మతులు చేయకుండా అలాగే ఉంచేశారు. దీనివల్ల తొలగించిన చోట ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో ఏమరుపాటుగా ఉంటే ప్రమాదానికి గురికావాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు. నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదన్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం



కసాపురంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో మన్యుసూక్త హోమం

గుంతకల్లుటౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి):కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పూర్వాభాద్ర నక్షత్రం, పుష్యార్యం సందర్భంగా మన్యుసూక్త హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువదీర్చారు. అనంతరం తిరుమంజనస్నపనం, అభిషేకాలు చేశారు. తర్వాత మూలమంత్ర హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కొండముచ్చు పట్టివేత



కొండముచ్చును బోనులో బంధించిన దృశ్యం

పుట్లూరు. జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామంలో వారం రోజుల నుంచి ఓ కొండముచ్చు కోతి గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. దీంతో వారు అటవీశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ఆదివారం గ్రామానికి చేరుకుని చాకచక్యంగా ఆ కోతిని బంధించారు. కోతివల్ల చాలా ఇబ్బందులు పడ్డామని గ్రామస్థులు అధికారులకు తెలిపారు.

నేటి నుంచి జేసీ క్రికెట్ టోర్నీ



మైదానాన్ని పరిశీలిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, జనవరి5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జేసీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం 7:30గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. టోర్నమెంట్ విజేతకు రూ.75వేలు, రన్నరప్‌కు రూ.50వేలు, మూడవ బహుమతిగా రూ.25వేలు నిర్వాహకులు అందించనున్నారు. మ్యాచ్ ప్రారంభ సమయానికి అరగంటే ముందే జట్ల సభ్యులు హాజరుకావాలని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులు విజ్జి, సుధీర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

మైదానాన్ని పరిశీలించిన జేసీపీఆర్

క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ సందర్భంగా కళాశాల మైదానాన్ని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పకడ్బందీగా టోర్నమెంట్‌ను నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఎన్ని జట్లు పాల్గొంటున్నాయి, వారికి కావాల్సిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఏలోపం రాకుండా టోర్నీ నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీ



విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం


రాయదుర్గంరూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని హరకేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాజరాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాలలో 22 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు. ఉపాధ్యాయినులు అనూరాధ, శ్రీదేవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సీనియర్ విభాగంలో యమున, సుష్మ, భారతి, జూనియర్ విభాగంలో చైత్ర, కీర్తన, తనుశ్రీ మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించారు. విజేతలకు, పాల్గొన్న వారికి నిర్వాహకులు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయనిర్ణేతలు మాట్లాడుతూ సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలని సూచించారు. మహిళా మండలి అధ్యక్షురాలు విమల, ప్రధాన కార్యదర్శి సరస్వతి, గౌరవ అధ్యక్షురాలు సునంద, స్వకులసాలి సమాజ అధ్యక్షుడు వెంకటేశులు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, విద్యావర్ధక సంఘం అధ్యక్షుడు ఆనందరావు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సేవాలాల్ బోధనలను విశ్వవ్యాప్తం చేయాలి

ఉరవకొండ, జనవరి5 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ బోధనలను యువత విశ్వ వ్యాప్తం చేయాలని బంజారా సంఘం, సేవాఘడ్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కేశవనాయక్ పిలుపునిచ్చారు. వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలో ఆదివారం సేవాలాల్ మహారాజ్ మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ ఆలయంలో చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కేశవనాయక్ మాట్లాడుతూ అశాంతి, అధర్మం నెలకొన్న తరుణంలో సేవాలాల్ మహారాజ్ తన బోధనల ద్వారా జాతిని జాగృతపరిచారన్నారు. ఆ బోధనలను ప్రతిఒక్కరికీ తెలియపరచాలని తెలిపారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు దాసు, సుబ్రహ్మణ్యం, నారాయణ, బాలునాయక్ పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం బలోపేతానికి కృషి

బొమ్మనహాళ్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వాల్మీకి సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నట్లు వాల్మీకి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజన్న, మండల అధ్యక్షుడు కేవీ వన్నూరుస్వామి, నాయకుడు దివాకర్ అన్నారు. సంఘం గ్రామ కమిటీల ఏర్పాటుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం వారు మండల కేంద్రంలో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వాల్మీకి సంఘం బలోపేతం కోసం గ్రామకమిటీలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు పోరాటం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వాల్మీకుల కష్టాలను గుర్తించి ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు వన్నూరుస్వామి, వన్నళ్లి రామాంజనేయులు, నీరగంటి శ్రీనివాసులు, రామకృష్ణ, పల్లీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు